# సత్యవాక్కు

సంపుటి - 42    జూన్ - 2021    సంచిక - 11

JUNE 21

## క్రైస్తవ మాసపత్రిక

**జూన్ - 2021**

సంవత్సర సభ్యత్వము రూ॥ 50/-

## టి.వి. ద్వారా క్రీస్తు సంఘముల సువార్త పరిచర్యలు

### సత్యవాణి

| | | |
|---|---|---|
| ఆదివారం సాయంత్రం | : | 6.00 గంటలకు శుభవార్త ఛానల్‌లో |
| బుధవారం సాయంత్రం | : | 6.30 ని॥లకు రక్షణ ఛానల్‌లో |
| గురువారం మధ్యాహ్నం | : | 2.30 ని॥లకు రక్షణ ఛానల్‌లో |
| శనివారం ఉదయం | : | 6.30 ని॥లకు ఆరాధన ఛానల్‌లో |
| ప్రతిరోజు ఉదయం | : | 7.30 ని॥లకు కాంతి ఛానల్‌లో |
| ప్రతిరోజు మధ్యాహ్నం | : | 3.30 ని॥లకు కాంతి ఛానల్‌లో |
| ప్రసంగీకులు | : | జాషువా గూటం |
| | | రిక్కీ గూటం |
| | | రోనీ గూటం |

Youtube లో satyavanicoc.kkd లో

పై కార్యక్రమములను చూడండి

మీ బంధుమిత్రులను కూడా ప్రోత్సహించండి

ఉచిత బైబిలు కాపీ కొరకు మాకు ఈరోజే వ్రాయండి

### ఈ సంచికలో


1. మంచి గొర్రెల కాపరి - పేజీ 3
2. క్రీస్తు ధర్మశాస్త్రము - 8
3. సారెపతు విధవరాలు - 13
4. అచ్చజటామాంసి అత్తరు బుడ్డీ - 19
5. సంక్షిప్త వార్తలు - 23



**SATYAVANI**

P.O. BOX. 80, KAKINADA

PIN : 533004. PH : 0884-2363722

98489 98547, www.satyavanivcoc.com

# సత్యవాక్కు

పోస్టు బాక్స్ - 80, కాకినాడ

ఆంధ్రప్రదేశ్ - 533 001.

ఫోన్ : 0884-2363722, సెల్ : 98489 98547

ఎడిటర్ : జాషువా గ్రూటం

క్రొత్త నిబంధన క్రైస్తవ పునరుద్ధరణ కొరకు

సంపుటి - 42 జూన్ - 2021 సంచిక - 11


## యేసు యొక్క అడుగుజాడలు

"క్రీస్తు కూడ మీ కొరకు బాధపడి, మీరు తన అడుగు జాడలయందు నడుచుకొనునట్లు మీకు మాదిరి యుంచిపోయెను" (1 పేతురు 2:21). దేవుని బిడ్డలకు యేసు ఆధ్యాత్మిక, నైతిక నడిపింపు ననుగ్రహించును. వారు ఏ ప్రదేశములలో యుండి ఏమి ఎదుర్కొనుచున్నారో, వారి కేమి అవసరమో ఆయన యెరుగును. యేసు యొక్క అడుగు జాడలలో నడుచుకొనుటయే ప్రతి క్రైస్తవునికి ఉండవలసిన ప్రగాఢమైన కోరిక, దేవుని నుండి వేరై మానవుడు తన మార్గమును తాను కనుగొనలేడు. ఏలయనగా "తమ మార్గము నేర్పరచు కొనుట నరుల వశములో లేదనియు, మనుష్యులు తమ ప్రవర్తనయందు సన్మార్గమున ప్రవర్తించుట వారి వశములో లేదనియు" వ్రాయబడి యున్నది (యిర్మియా 10:33). మానవుడు ఈ లోకములో ప్రయాణించు నప్పుడొక మార్గదర్శి కొరకు అతని హృదయము అన్వేషించును. యేసు యొక్క అడుగుజాడలలో నడుచుకొను టకు మానవుడు ప్రతిష్టించు కొనుటయే గాక, ప్రయత్నము కూడ అతని నుండి అవసరమై యున్నది.

యేసు యొక్క అడుగు

జాడలలో నడుచు నిమిత్తము మనము ఆయనతో కూడ బాధపడుటకు ఇష్ట పడుటయేగాక, ఆయన యొక్క మనస్సును కలిగి యుండవలెను. "క్రీస్తు యేసునకు కలిగిన యీ మనస్సు మీరును కలిగి యుండుడి యని పౌలు చెప్పెను (ఫిలిప్పి 2:8). సుఖ సంపదల కొరకు, బాధల కొరకు, అధికారము కొరకు మానవుల మనస్సులు కోరికలతో నిండియుంటవి. ఒక్కోసారి ఈ కోరికల ప్రభావము ఎక్కువగుటచేత వారు తమ సహజ లక్షణములను, యధార్థవిలువలను మరచిపోయి అంధులవలె ప్రవర్తిం చుట జరుగును. "నా చిత్తము కాదు, నీ చిత్తమే సిద్ధించును గాక" అని యేసు చెప్పిన రీతిగ మనము యేసువలె ఆలోచించుట, యేసు చేసిన రీతిగ చేయుట నేర్చుకొనవలెను.

యేసు యొక్క అడుగు జాడలలో నడుచు నిమిత్తము మనము విధేయత చూపించు స్వభావమును అలవరచుకొనవలెను. విధేయతలోని ప్రాముఖ్యతను యేసు ముందుగనే మనకు సూచించెను. ఆయన ఇట్లనెను; ప్రభువా, ప్రభువా అని నన్ను పిలచు ప్రతివాడును పరలోక రాజ్యములో ప్రవేశింపడు గాని పరలోకమందున్న నా తండ్రి చిత్తప్రకారము చేయువాడే ప్రవేశించును" (మత్తయి 7:21). యేసును ప్రభువా అని పిలుచు ప్రతి వాడును ఆయనకు అన్ని విషయములలో సంతోషముతో విధేయుడగుచు నిలకడగా యుండ వలెను. "నేను చెప్పుమాటల ప్రకారము మీరు చేయక ప్రభువా, ప్రభువా అని నన్ను పిలుచుట ఎందుకు?" అని యేసు అడిగెను (లూకా 6:46). విధేయతగల స్వభావమును గూర్చి పౌలు ఇట్లనెను; "ఆయన, కుమారుడై యుండియు తాను పొందిన శ్రమవలన విధేయతను నేర్చుకొనెను. మరియు ఆయన సంపూర్ణసిద్ధి పొందినవాడై... తనకు విధేయులైన వారికందరికిని నిత్య రక్షణకు కారకుడాయెను" (హెబ్రీ 5:8-10). "మీరు వినువారు మాత్రమై యుండి మిమ్మును మీరు

వినవచ్చుకొనకుండ, వాక్య ప్రకారము ప్రవర్తించువారునై యుండుడి" యని యాకోబు వ్రాసెను (యాకోబు 1:22). క్రైస్తవుడగుటకు, క్రైస్తవునిగా కొనసాగుటకు విధేయత అను సూత్రమును ప్రతివాడు నేర్చుకొన వలెను, పాటించవలెను. క్రీస్తుకు లోబడుట యనగా ఆయన అడుగు జాడలలో నడుచుకొనుటయే.

**యేసుయొక్క అడుగుజాడలలో నడుచుకొను నిమిత్తము మనము విశేష జాగ్రత్త కలిగియుండుట నేర్చు కొనవలెను.** హెబ్రీ పత్రిక లేఖకుడు ఇట్లనుచున్నాడు: "కావున మనము వినిన సంగతులను విడిచిపెట్టి కొట్టుకొని పోకుండునట్లు వాటి యందు విశేష జాగ్రత్త కలిగి యుండవలెను (హెబ్రీ 2:1). క్రైస్తవుడు తన హృదయమును దేవునికి సంపూర్తిగ సమర్పించు కొనవలసిన వాడు గనుక అతడు విశేష జాగ్రత్త కలిగి యుండు గొప్ప గుణమును అలవరచుకొనవలెను. "ఆయన శాసనములను గైకొనుచు పూర్ణ హృదయముతో ఆయనను వెదకువారు ధన్యులు" (కీర్తన 119:2). ఒకని బాధ్యతలు నిర్వర్తించు ఒత్తిడిలో ఆత్మ యొక్క విశేష జాగ్రత్త అత్యవసరము. యేసు ఇట్లనెను: "అయితే నేను పొంద వలసిన బాప్తిస్మమున్నది; అది నెరవేరువరకు నేనెంతో ఇబ్బంది పడు చున్నాను" (లూకా 12:59). మన విధిని నిర్వర్తించుటలో యేసులాంటి మనస్తత్వము కలిగియుండవలెను. "పగలున్నంత వరకు నన్ను పంపిన వాని క్రియలు మనము చేయుచుండ వలెను; రాత్రి వచ్చుచున్నది, అప్పుడెవడును పనిచేయలేడు" అని ఆయన పలికెను (యోహాను 9:4). గనుక మనము మరింత ఆసక్తితో యేసును వెంబడింతము.

**యేసు యొక్క అడుగుజాడలలో నడుచు నిమిత్తము మనము ప్రేమ యొక్క శక్తిని ఎరుగవలెను.** మనోహర జీవితమును జీవించుటకు ప్రేమ పునాదియై యున్నది. మానవ జీవితములో ప్రేమ అతి ప్రాముఖ్య మైనది. దేవుని ప్రేమ శక్తి తెలియ

జేయబడుచున్నది. అది మనలను ఆకర్షించి పట్టుకొని బలవంతులనుగా తయారు చేయుచున్నది. మనలను సరిచేసి నిత్యలోకమందలి శ్రేష్ఠమైన జీవమును మనకు చూపించు చున్నది. మానవ సహోదరభావము ప్రేమ అనే సూత్రము పైన మాత్రమే నిర్మించ బడును. పరిచర్యలో మానవ హృదయ ములను బంధింప గలిగినది ప్రేమ ఒక్కటి మాత్రమే భూమిపై మానవ సహోదర భావమును నెలకొల్పుటకు యేసు వచ్చెను. ఆయన జన్మించిన రాత్రివేళ దేవునికి మహిమయు, మనుష్యులకు భూమిమీద సమాధాన మును కలుగును గాక యని దేవ దూతలు పాడిరి. సహోదర ప్రేమ మానవులను ఏకాభిప్రాయము గల వారిగ బంధించును. శాంతికి, భద్రతకు, నిత్య నిరీక్షణకు అది ఆదర్శమై యున్నది. ప్రేమానురాగముల సూత్రములు పాటించబడలేనిచోట్ల మానవులు విడిపోయి పడిపోవుట జరుగును.

ఈ సూత్రము అనేకులకు తెలియక పోవుట చాల విచారకరము. అన్ని విషయములలో కూడ మానవులందరు ఈ మార్గమును తెలిసికొని అవలంబించినయెడల అది వారికి మేలు. ఏలయనగా మానవుడేమి విత్తునో ఆ పంటనే కోయును అని వ్రాయబడి యున్నది. యధార్ధప్రేమ కలిగిన ప్రతివాడును ఇతరులకు మేలుచేయవలెనని కాంక్షించును. దానినిబట్టి సమాజము నకు, లోకమునకు అతడు మేలు చేయుపురికొల్పబడును. ఎవని హృదయమైతే ప్రేమతో కదిలింపబడు చున్నదో అట్టివాడు ఈ లోకమును వీడుసరికి దానిని శ్రేష్ఠమైన దానిగా విడువనెంచుకొనును. యేసు అడుగు జాడలలో నడుచుకొనుటకు మనము సమృద్ధియైన ప్రేమను కలిగి యుండవలెను.

యేసుయొక్క అడుగుజాడలలో నడుచుకొను. నిమిత్తము మనము ఓర్పును అలవరచుకొనవలెను. అన్నిటి కన్న ఓర్పును నేర్చుకొనుట అతికష్ట మైనది. జీవిత క్లిష్టపరిస్థితుల నెదుర్కొ

నుటలో సణుగుకొనకుండ సహించు స్వభావమును కలిగియుండుటయే ఓర్పు. "మీరు మీ ఓర్పు చేత మీ ప్రాణములను దక్కించుకొనుడి" యని ప్రభువు చెప్పెను (లూకా 21:19). యేసు జీవితములో ఓర్పుయొక్క పరిపూర్ణ మాదిరి మనకు కన్పించు చున్నది. మనము ఎదుర్కొనుచున్న సమస్యల వంటి వాటినుండి ఆయన జీవితము కూడ సంరక్షింపబడి యుండలేదు. సరిగదా అన్నిరకములైన శోధనలకు ఆయన గురియయ్యెను. ప్రతి అడుగులోను యేసు శత్రువులను విభేదములను ఎదుర్కొనెను. మనందరి కంటె ఎక్కువ మానవుల మధ్య ఆయన బాధ ననుభవించెను.

అయినను ఆయన ఓర్పు పరిపూర్ణమైనది. ఆయన తన స్వకీయు లకు ప్రేమ బహుమానములను తెచ్చెను గాని వారాయన బహుమాన ములను తిరస్కరించిరి. వారాయన చేతులను ఒక మ్రానునకు మేకులతో దిగగొట్టునంతవరకు ఆయన వారియెడల తన చేతులు చాపి యుండెను. అపొస్తలులతో ఆయన చేసిన కృషియంతటిలోను ఆయన ఓర్పు ఎక్కువ వెల్లడి యగుచున్నది. మొదట వారు పామరులు, అభ్యసిం చుటలో మందకొడులు, త్వరితగతిని గ్రహించుకొనలేని వారి తత్వమును బట్టి వారాయనను ఎక్కువ విసిగించిరి. అయినను వారి దోషములన్నిటిని గూర్చియు ఆయన ఓర్పు వహించి అంతము వరకు వారిని ప్రేమించెను.

ఆయన చుట్టు గుమిగూడే ప్రజల యెడల కూడ ఆయన ఓర్పు కలిగి యుండెను. నిరుపేదలు, నిరాశ్ర యులు ఆయన చుట్టూ గుమిగూడే వారు; అయినను గంటల తరబడి విశ్రాంతి లేకుండ ఉదయాన్నుంచి సాయంత్రంవరకు ఆయన వారి యెడల ఓపిక కలిగి వారికందరికి సహాయము చేయుచుండెను. మనము యేసు అడుగు జాడలలో నడుచుకొన వలెనన్న ఈ గొప్ప పాఠమును నేర్చుకొనవలసియున్నది.

చివరిగా, యేసు అడుగు జాడ లలో నడుచుకొనవలెనన్న ప్రార్థనాశక్తి

ని మన మెరుగవలెను. "మనము కనికరింపబడి సమయోచితమైన సహాయము కొరకు కృప పొందునట్లు ధైర్యముతో కృపాసనము నొద్దకు చేరుదము" అని హెచ్చరింపబడితిమి (హెబ్రీ 4:16). దేవుని కుమారుడైన యేసుక్రీస్తు ఇప్పుడు పరలోకమందు మనకొక గొప్ప ప్రధానయాజకుడై యున్నాడు. మనము తెలిసికొన వలసిన సంగతులనేకములను ఈ మంచి వాక్యము మనకు తెలియ జేయుచున్నది. యేసు ఉన్నచోట మనకొక సింహాసన మున్నదని అది చెప్పుచున్నది. మరియు మన విజ్ఞాపనలు తండ్రియైన దేవుని సన్నిధానమునకు చేరునట్లు ఆయన చూచును అని అది చెప్పుచున్నది. మరియు ప్రేమగల దేవుని కృపచేత ఆ సింహాసనము కప్పబడి యున్నదని అది చెప్పుచున్నది. యేసును వెంబడిం చవలెనంటే మనము ప్రార్థనలో కొంత సమయమును గడుపవలెను. అంతే కాకుండ మన జీవితములో ప్రార్థన యొక్క గొప్పశక్తిని తెలిసికొనగలిగిన వారమై యుండవలెను.

నీవు యేసు అడుగుజాడలలో నడుచుకొన గోరుచున్నావా? అయితే ఆయనయందు విశ్వాసముంచుము, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొంది ఆయన మార్గములో ఈనాడే ప్రవేశించుము.

## క్రొత్త నిబంధన యొక్క శ్రేష్టత

ప్రజల పక్షముగా బలుల నర్పించుటకు పాతనిబంధన ఒక యాజకత్వమును నెలకొల్పెను. ప్రజలు నేరుగా దేవుని సమీపించ వీలులేకుండెను. సరిగదా వారు తమ అర్పణలను, బలులను ఒక యాజకుని యొద్దకు తేగా అతడు వారి తరపున వాటిని దేవునికి అర్పించేవాడు. ఈ యాజకులు లేవీ గోత్రమునుండి ఏర్పరచబడిన వారు మరియు ప్రధాన యాజకుడు అహరోను సంతతి నుండి నియమించబడెను. ఈ

యాజకులు సామాన్యులే. వారు తమ బలహీనతలను, పొరబాట్లను కలిగి యుండిరి. అందువలన వారు మానవులే గనుక మిగతా మానవులతో సానుభూతి కలిగియుండిరి. "తాను కూడా బలహీనత చేత ఆవరింపబడి యున్నందున అతడు ఏమియు తెలియని వారి యెడలను త్రోవ తప్పిన వారి యెడలను తాలిమి చూపగల వాడైయున్నాడు. ఆ హేతువు చేత ప్రజల కొరకేలాగో అలాగే తన కొరకును పాపముల నిమిత్తము అర్పణము చేయువలసినవాడై యున్నాడు" (హెబ్రీ 5:2,3). యాజకుడు మిగతా వారందరివలె పాపియైన వాడు గనుక మొదట అతడు తన కొరకు బలి అర్పించిన తరువాత, మిగతావారి కొరకును బలి అర్పించ బాధ్యుడై యుండెను. క్రొత్త నిబంధనలో అయితే మనకొక శ్రేష్ట మైన ప్రధాన యాజకుడైన యేసుక్రీస్తు వున్నారు. "ఆకాశ మండలము గుండా వెళ్ళిన దేవుని కుమారుడైన యేసు అను గొప్ప ప్రధాన యాజకుడు మన కున్నాడు గనుక మనము ఒప్పుకొనిన దానిని గట్టిగా చేపట్టుదము. మన ప్రధాన యాజకుడు మన బలహీనతల యందు మనతో సహానుభవము లేని వాడు కాడుగాని సమస్త విషయము లలోను మనవలే శోధింపబడినను ఆయన పాపము లేనివాడుగా ఉండెను. గనుక మనము కనికరింపబడి సమయోచితమైన సహాయము కొరకు కృప పొందునట్లు ధైర్యముతో కృపాసనము నొద్దకు చేరుదము" (హెబ్రీ 4:14-16). మన బలహీనతల విషయంలో మనతో సానుభూతి కలిగిన ప్రధాన యాజకుడు మన కున్నాడు. ఏలయనగా ఆయన మానవు దయ్యారు, మానవుని వలె అన్ని శోధనలు అనుభవించారు. గాని ఆయన ఎన్నడు శోధనకు లొంగిపో లేదు. ఆయన ఎన్నడు పాపము చేయ లేదు.

"పవిత్రుడును, నిర్దోషియు, నిష్కల్మషుడును పాపులలో చేరక ప్రత్యేకముగా ఉన్నవాడును ఆకాశ మండలము కంటె మిక్కిలి హెచ్చయిన

వాడునైన యిట్టి ప్రధాన యాజకుడు మనకు సరిపోయినవాడు. ఈయన ఆ ప్రధాన యాజకులవలె మొదట తన సొంత పాపముల కొరకు తరువాత ప్రజల పాపముల కొరకు దినదినము బలులు అర్పింపవలసిన అవుసరము గలవాడు కాడు; తన్నుతాను అర్పించు కొన్నప్పుడు ఒక్కసారే యీ పని చేసి ముగించెను" (హెబ్రీ 7:26-28). గనుక యేసు యొక్క యాజకత్వము శ్రేష్టమైనది.

## శ్రేష్టమైన వాగ్దానములు

క్రొత్త నిబంధన అంతరంగికమైనది; ఆత్మీయమైనది. "వారి మనస్సులలో నా ధర్మ విధులను ఉంచెదను. వారి హృదయముల మీద వాటిని వ్రాయుదును" (హెబ్రీ 8:10). మొదటి నిబంధన రాతిపలకల మీద వ్రాయబడెను గాని క్రొత్తనిబంధన అయితే మన హృదయముల మీద వ్రాయబడెను. దేవుడు తన వాక్యమును నేరుగా మన హృదయములలోనికి పంపునని దీని ఉద్దేశ్యము కాదు. బోధించుట ద్వారా, పఠించుట ద్వారానే నేటికిని జ్ఞానమును కలుగును". వారందరు దేవుని చేత బోధింపబడుదురు అని ప్రవక్తల లేఖనములలో వ్రాయబడియున్నది గనుక తండ్రి వలన విని నేర్చుకొనిన ప్రతివాడును నా యొద్దకు వచ్చును" అని యేసు చెప్పారు (యోహాను 6:45). మనం దేవుని వాక్యాన్ని వినుచూ యుండాలి, నేర్చుకొనుచు యుండాలి అని గమనించుము. అయితే ఇప్పుడా వాక్యము మన హృదయముల మీద వ్రాయబడియున్నది. పాతనిబంధన ప్రకారము ఒకడు భౌతిక జన్మద్వారా దానికి బాధ్యుడయ్యాడు, తరువాత అతడు దేవుని గూర్చి బోధింపబడ్డాడు. ఇప్పుడైతే ఒకడు దేవుని గూర్చి విని నేర్చుకొని హృదయపూర్వకముగా లోబడి, దేవుని రాజ్యసభ్యుడవుతాడు. దేవుని వాక్య సారాంశము అతని హృదయములో నాటబడనంత వరకు అది శక్తిహీనమైన దగును.

ఇప్పుడు మనము దేవునితో సన్నిహిత సంబంధము కలిగి యున్నాము. "నేను వారి దేవుడనై

యుందును వారు నా ప్రజలై యుందురు (హెబ్రీ 8:10). ఈ మాట లేమీ క్రొత్తవి కావు. అవి లేవీ 26:12 లో కనబడును. అయినను వాటికిప్పుడు ఒక పరిపూర్ణ భావము న్నది. పాతనిబంధన నిజానికి దేవునికి ఆయన ప్రజలకు గొప్ప దూరమును కల్పించినది. దేవాలయములో యున్న అడ్డుతెరయు, యాజకత్వము దీనికి సాదృశ్యము, గాని ఇప్పుడయితే అందరు నేరుగా దేవుని చేరుకోగలరు. క్రైస్తవులందరు, స్త్రీలు, పురుషులు, అన్ని జనాంగముల వారు పాతనిబంధన యాజకులతో సమానులు. "ప్రభువు సమీపముగా యున్నాడు" (ఫిలిప్పీ 4: 5). "సమస్త జ్ఞానమునకు మించిన దేవుని సమాధానము" యేసుక్రీస్తు వలన ఇప్పుడు మనము కలిగి యున్నాము (ఫిలిప్పీ 4:7).

"వారిలో ఎవడును ప్రభువును తెలిసికొనుడని తన పట్టణస్థునికైనను ఉపదేశము చేయడు. వారిలో చిన్నలు మొదలుకొని పెద్దల వరకు అందరును నన్ను తెలిసికొందురు" (హెబ్రీ 8:11). మనం ఇంతకు ముందే చెప్పుకొన్నట్లు పాత నిబంధనలో ఒకడు శరీరమూల ముగా జన్మించును, తదుపరి దేవుని గూర్చి అతనికి బోధింపబడును. అనేకులకు అది కుటుంబాచారము లేదా దేశాచారము. వ్యక్తిగత సమర్పణ యేమీలేదు. అనేకులు దేవుని గూర్చి తెలిసికోలేదు, నేర్చుకొని ఆత్మీయ ముగా తిరిగి జన్మించిన వారమై ఆ నిబంధనకు బాధ్యులమవుదుము (యోహాను 3:3-5). క్రొత్తనిబంధన సమస్త జనులకు, సర్వజనాంగములకు, మానవులందరికీ వర్తించును. పాత నిబంధనయైతే ఇశ్రాయేలు జనాంగమునకే వర్తించెను.

## శ్రేష్ఠమైన బలియాగము

"నేను వారి దోషముల విషయము దయగలిగి వారి పాపము లను ఇకను ఎన్నడును జ్ఞాపకము చేసి కొనననని ప్రభువు సెలవిచ్చుచున్నాడు" (హెబ్రీ 10:4). పాత నిబంధనలో అర్పింపబడిన బలుల రక్తము "పాపములను తీసివేయు దేవుని గొర్రె పిల్ల" వైపు సూచించెను (యోహాను

1:29). పాత నిబంధన బలులు పాపములను ఏటేటా జ్ఞప్తికి తెచ్చెను. గాని పాపపరిహారము ఇయ్యకుండెను (హెబ్రీ 10:3). అయితే క్రీస్తులో దేవుడు మన పాపములను ఎన్నడు జ్ఞాపకముంచుకొనడు. యేసు తానే పరిపూర్ణ బలియాగముగా తన్ను తాను అర్పించుకొనెను. "క్రీస్తు కూడ అనేకుల పాపములను భరించుటకు ఒక్కసారే అర్పింపబడి తన కొరకు కనిపెట్టుకొని యుండు వారి రక్షణ నిమిత్తము పాపము లేకుండ రెండవసారి ప్రత్యక్షమగును" (హెబ్రీ 9:28). "యేసుక్రీస్తు యొక్క శరీరము ఒక్కసారియే అర్పింపబడుట చేత ఆ చిత్తమును బట్టి మనము పరిశుద్ధపరచ బడుచున్నాము" (హెబ్రీ 10:10). సర్వకాల సర్వావస్థల యందుండు మానవులందరి నిమిత్తము యేసు పాప పరిహార బలియాయెను. పాత నిబంధనలోని పశుబలుల వలె ఈయన పదేపదే బలి అవ్వవలసిన పనిలేదు.

## ముగింపు

పాత నిబంధన కంటె క్రొత్త నిబంధన అనేక మేలులను సమకూర్చెను. మనము ఇంకా ఎన్నో చెప్పుకొనవచ్చును. అయితే శ్రేష్ఠమైన నిబంధనకు క్రీస్తు పరిపూర్ణ మధ్య వర్తియాయెనని తెలిసికొనుటకు యివి చాలును. మనలో ప్రతివాడును ఈ నూతన నిబంధనలో సభ్యులమై యుండునట్లు జాగ్రత్త పడవలెను. ఈ నిబంధన సంబంధమును మరి దేని కొరకైననూ ఎన్నడు పోగొట్టుకొన కూడదు. ఈ నూతన నిబంధనలో ప్రవేశించు షరతులు సూక్ష్మమైనవే. యేసుక్రీస్తు నందలి విశ్వాసము పాపముల విషయమైన మారు మనస్సు, క్రీస్తునందలి విశ్వాసము యొక్క ఒప్పుకోలు (రోమా 10:10). మరియు పాపక్షమాపణ నిమిత్తము క్రీస్తులోనికి బాప్తిస్మము (అపొ.కా. 2:36-39). యివి జరిగించగానే ఆయన నీ పాపములు క్షమించి నిన్ను తన రాజ్యమైన సంఘములో సభ్యునిగా చేర్చుకొనును!

– జెర్రీబేట్స్

# దుఃఖబాధలులేని ప్రదేశము

డా॥ రోయస్ ఫ్రెడిరిక్

ఈ భూమి దుఃఖబాధలు లేని ప్రదేశము కాదు. ప్రతిదినము సమృద్ధి యైన దీవెనలతో కూడినదే. అయినను శ్రమలు కూడా తొంగిచూచును. అవి దుఃఖకరమైనవగును. మన బలహీనత లనుబట్టి కలుగు దుఃఖబాధలను గూర్చి నేను తలంచుచున్నాను. కొన్ని సంగతులు మనం మరచిపోవునట్లు చేయుట ద్వారా శాంతముగా యుండునట్లు ప్రభువు మనకు సహాయము చేయును. కొన్ని సంగతులు మరచిపోవునట్లు మరికొన్నిటిని జ్ఞాపకముంచుకొను నట్లును అయనచేయును. దీనిని పౌలు జీవితంలోను, ఇతరుల జీవితం లోను మనం చూడగలము. మన మాయన బిడ్డలమైనప్పుడు మన జీవితంలో అవుసరమైన మార్పులు చేసికొనుటకు ఆయన సహాయం చేయును. మన పొరబాట్ల నుండి నేర్చు కొనునట్లును యితరులకు సహాయం చేయునట్లును ఆయన నడిపించును (రోమా 6:3,4; గలతీ 3:26, 27; యాకోబు 1:2-4; 2 పేతురు 1:5-10; 2 కొరింథీ 1:3,4; ఫిలిప్పీ 4:4-9).

పరలోకములో బాధతో కూడిన దుఃఖములుండునా? యని మనం తలంచవచ్చును. ప్రకటన 21:4లో ప్రభువు తన ఆశీర్వాద నిర్ధారణను యిచ్చుచున్నారు. క్రొత్త భూమి, క్రొత్త ఆకాశములో "ఆయన వారి (మన) కన్నుల ప్రతిబాష్పబిందువును తుడిచి వేయును. మరణము ఇక ఉండదు. దుఃఖమైనను, వేదనయైనను, ఏడ్పైనను ఇక ఉండదు".

ప్రభువు తనకు నమ్మకమైన బిడ్డలను తనతో యుండుటకు ఆయన కాలమానమును బట్టి కొనిపోవును. అక్కడ పరిపూర్ణ సంతోషము శాంతి యుండును. అక్కడ దుఃఖబాధల

జ్ఞాపకము లేవీ ఉండకుండ ఆయన చేయును. మన వైఫల్యముల జ్ఞప్తిగాని, ఇతరుల వైఫల్యములుగాని అక్కడ జ్ఞాపకముండవు. భూసంబంధమైన విచారణ జ్ఞాపకములు పరలోకంలో యేమీఉండవు. ఏలయనగా పర లోకము దు:ఖబాధలు లేని ప్రదేశము!

గమనిక : ఇంకొక నెలలో తాను చనిపోవకముందు రోయస్ ఫ్రెడిరిక్ గారు డిశంబరు 2020లో వ్రాసిన వ్యాసము యిది - ఎడిటర్

## చారిత్రాత్మకుడైన యేసు

పురాతన వ్యక్తులందరి కంటే నజరేయుడైన యేసును గూర్చిన చారిత్రాత్మక రుజువులు ఎన్నో యున్నవి.

5000 కంటే ఎక్కువైన గ్రీకు భాషలో వ్రాయబడిన తాళపత్రములు, క్రీ.శ.130 సంవత్సరముల లోపు వ్రాయబడిన క్రొత్తనిబంధన ప్రతులు వేలకొలది యున్నాయి. అవి యేసు అను వ్యక్తిని గూర్చి చెబుతాయి. ఆయన దేవుని కుమారుడు.

క్రొత్తనిబంధన గ్రంధము 8 మంది దైవావేశ లేఖకులచే వ్రాయబడినది. వీరందరి వ్రాతలలోను 1500 సార్లు యేసును గూర్చి చెబుతారు. ఈ లేఖకులలో కొందరు యేసు యొక్క పరిచర్యలో ఆయనతో యుండిన వారు. మత్తయి, యోహాను, పేతురు ఆయనతో సన్నిహితముగా తిరిగిన వారు. మార్కు, యూదా, యాకోబు ఆయనతోను ఆయన సహచరులతోను సన్నిహిత సంబంధములు కలిగిన వారు.

వారు ఆయన సజీవుడై తిరిగి లేచిన 15 సంవత్సరము కాలములోనే ఆయనను గూర్చి వ్రాసియుండిరి. యేసు యొక్క సహోదరుడైన యాకోబు (క్రొత్తనిబంధన వ్రాసిన వారిలో బహుశ మొదటివాడు) తానే ఒక చారిత్రాత్మక వ్యక్తిగా పరిగణింప

బద్దాడు. అతని గూర్చి యూదుల చరిత్రకారుడైన ఫ్లేవియస్ జోసిఫస్ (క్రీ.శ.37–100) కూడ వ్రాసాడు. క్రీ.శ.45లో యాకోబు ఇట్లు వ్రాసాడు: "దేవుని యొక్కయు ప్రభువైన యేసుక్రీస్తు యొక్కయు దాసుడైన యాకోబు అన్యదేశముల యందు చెదిరియున్న పండ్రెండు గోత్రముల వారికి శుభమని చెప్పి వ్రాయునది" (యాకోబు 1:1).

యేసుక్రీస్తు యదార్థముగా ఈ లోకంలో జన్మించి జీవించి, మరణించి, తిరిగిలేచినాడని క్రొత్త నిబంధనయే తిరుగులేని రుజువు నిచ్చుచున్నది. ఆయన మనుష్యునిగా జన్మించిన దేవుడు, కాబట్టిదేవుని కుమారుడు.

- దేవిడ్ ఫేనింగ్

## ఆశ్చర్యం

యేసుప్రభువు ఎక్కడికి వెళ్లినా ఆయన గొప్పతనాన్ని బట్టి ప్రజలు ఆశ్చర్యపోయేవారు.

ఆయన బాలునిగా యున్నప్పుడు "యోసేపును ఆయన తల్లియు ఆయనను గూర్చి చెప్పబడిన మాటలను విని ఆశ్చర్యపడిరి" (లూకా 2:33).

ఆయన తన పండ్రెండవ యేట "దేవాలయములో బోధకుల మధ్య కూర్చుండి వారి మాటలను ఆలకించుచు వారిని ప్రశ్నలడుగుచు ఉండగా చూచిరి. ఆయన మాటలను వినిన వారందరు ఆయన ప్రజ్ఞకును ప్రత్యుత్తరములకును విస్మయ మొందిరి" (లూకా 2:46–48).

యూదులు ఆయన బోధించుచుండగా విని, "చదువుకొనని అతనికి ఆ పాండిత్యమెట్లు వచ్చెనని ఆశ్చర్య పడిరి" (యోహాను 7:14–15).

ఆయన రూపాంతరము పొందినప్పుడు శిష్యులు ఆయనను గూర్చి

ఆశ్చర్యపడిరి (మార్కు 9:1-15). ఆయన చేయుచున్న అద్భుతములను చూచి ప్రజలు విస్మయమొందిరి (మత్తయి 12:23; యోహాను 7:21).

"మూగవారు మాటలాడుటయు, అంగహీనులు బాగుపడుటయు, కుంటివారు నడుచుటయు, గ్రుడ్డివారు చూచుటయు జనసమూహము చూచి ఆశ్చర్యపడి ఇశ్రాయేలు దేవుని మహిమపరచిరి" (మత్తయి 15:31)

ఆయన మాట చెప్పగానే అంజూరపు చెట్టు ఎండిపోవుట చూచి ఆయన శిష్యులు ఆశ్చర్యపడిరి (మత్తయి 21:20). ఆయన ఒక సమరయ స్త్రీతో మాటలాడుట, ప్రకృతిని గద్దించుట మొ||నవి శిష్యులు చూచి "ఈయన ఎట్టివాడో, ఈయనకు గాలియు సముద్రము లోబడుచున్నవని చెప్పుకొనిరి" (మత్తయి 8:27).

ఆయనను వెంబడించుచున్న వారు ఆయన బోధకు, అద్భుత కార్యములకు విస్మయమొందిరి (మార్కు 1:27). ఆయన శరీరముతో పునరుత్థానుడైనందున ఆశ్చర్యపడిరి (లూకా 24:39-41).

ఆయన శత్రువులు సయితము విస్మయమొందిరి (మత్తయి 22:22). ఆయన మౌనియై యుండుట పిలాతు చూచి ఆశ్చర్యపడెను (మత్తయి 27:14).

ఆయనను సిలువ వేసిన వారును ఆయన మహోత్కృయమును బట్టి ఆశ్చర్యపోయిరి (లూకా 23:47). ఆయనను వెంబడించుము నీవు కూడా విస్మయ మొందుదువు!


సత్యవాణి స్కూల్ ఆఫ్ ఎవాంజలిజమ్‌లో చేరండి. ఆన్‌లైన్‌లో జూమ్‌లో పాఠములు నేర్పబడును. వివరములకు దిగువ నెంబరుకు ఫోన్ చేయండి :

**98489 98547**

# నాశనమునకు ఐదు మెట్లు

ఇశ్రాయేలు యూదాదేశముల యొక్క క్లిష్టపరిస్థితులలో యిర్మీయా ప్రవక్తగా పిలువబడెను. ఉత్తరదేశమైన ఇశ్రాయేలు అప్పటికే బానిసత్వము లోనికి కొనిపోబడిరి. క్రీ॥పూ॥ 700 సంవత్సరముల క్రితమే తన పాపము లను గూర్చి యెషయా ఇశ్రాయేలు దేశమును హెచ్చరించెను. అయినను వారు వినలేదు, అతని హెచ్చరికలను లక్ష్యపెట్టలేదు.

దక్షిణ భాగమున నున్న యూదా గోత్రమునకు ప్రవక్తగా యిర్మీయా పిలువబడెను, గాని తన వయస్సును బట్టి ఆ పనికి తగురీతిగా సిద్ధపడినవాడను కానని అతడు తలంచాడు (యిర్మీయా 1:5,6). గాని యెహోవా దేవుడు అతని విషయమై సంకల్పించియుండెను. “యిదిగో నేను నీ నోట నా మాటలు ఉంచియున్నాను. పెల్లగించుటకును, విరుగగొట్టుట కును, నశింపజేయుటకును, పడద్రోయుటకును, కట్టుటకును, నాటుటకును నేను ఈ దినమున జనులమీదను, రాజ్యములమీదను నిన్ను నియమించియున్నాను” అని యెహోవా అతనికి సెలవిచ్చెను (యిర్మీయా 1:9,10). అదే గ్రంథములో తదుపరి కాలములో యిర్మీయా పడిన భయము బలపడెను. అయితే అతని భయము కంటే ప్రకటించాలనెడి కాంక్ష గొప్పగా యుండెను. “ఆయన పేరు నేనెత్తను ఆయన నామమును బట్టి ప్రకటింపను అని నేననుకొంటినా? అది నా హృదయములో అగ్నివలె మండుచు నా యెముకలలోనే మూయబడి యున్నట్లున్నది, నేను ఓర్చి యోర్చి విసికియున్నాను, చెప్పకమానలేను” అని అతడు పలికాడు (యిర్మీయా 20:9).

యిర్మీయా కాలము మన వలెనే యుండెను. అది సౌభాగ్యవంత సమయము గాని ఆత్మీయముగా బీదస్థితి, భక్తిహీనత ప్రబలియున్న కాలము. యిర్మీయా కాలములో నరకమునకు పోవు సమాజమును కనుగొందుము. నాశనమునకు వారు పోయిన ఐదుమెట్లును ఇప్పుడు గమనించుదాము.

**యెహోవా వాక్యము నందు వారికి సంతోషములేదు :** (యిర్మీయా 6:10). "జ్ఞానులు అవమానము నొందినవారైరి. వారు విస్మయమొంది చిక్కున వడియున్నారు, వారు యెహోవా వాక్యమును నిరాకరించిన వారు, వారికి ఏపాటి జ్ఞానము కలదు?" (యిర్మీయా 8:9). వారు యెహోవా మాట విననివారు, శిక్షకు లోబడ నొల్లనివారు (యిర్మీయా 7:28). వారు ముందుకు వెళ్లుటకు బదులు వెనుకకు వెళ్లిరి (యిర్మీయా 7:24).

**అందరు మోసము చేసి** దోచుకొనువారు (యిర్మీయా 6:13). యెషయా వారిని ఎంత తినినను తృప్తి లేని కుక్కలుగా పోల్చుచున్నాడు (యెషయా 56:11). ధనాపేక్ష విగ్రహారాధనయని మనము గమనించాలి (కొలస్స 3:5; లూకా 12:15). వెండి బంగారములతో రక్షణను సంపాదించుకొనలేము (జెఫన్యా 1:18). సరిగదా మనం భూమి మీద సమకూర్చుకొనిన సంపదను బట్టి దేవుడు సంతోషించరు. మనం పరలోకమందు ధనమును కూర్చుకొనాలి, సంతుష్టిసహితమైన జీవితాన్ని జీవించాలి (మత్తయి 6:19-24; హెబ్రీ 13:5).

**సమాధానము లేని సమయమున వారు సమాధానము,** సమాధానము అని చెప్పిరి (యిర్మీయా 6:4). వారి చుట్టూయున్న సమస్యలను వారు గుర్తించలేదు. సంఘములు ఎదుర్కొనుచున్న సమస్యలను నేడు అనేకులు గుర్తించరు. ప్రతి కాల

మందును యున్న అబద్ధ బోధకులను గూర్చి బైబిలు చెప్పుచు యున్నది. "మరియు అబద్ధప్రవక్తలు ప్రజలలో ఉండిరి. అటువలెనే మీలోను అబద్ధ బోధకులుందురు. వీరు తమ్మును కొనిన ప్రభువును కూడ విసర్జించుచు తమకు తామే శీఘ్రముగా నాశనము కలుగజేసికొనుచు నాశనకరమగు భిన్నాభిప్రాయములను రహస్యముగా బోధించుదురు" (2పేతురు 2:1). ఆశీర్వాద కాలములో మనము జీవించుచున్నను మనం ఎల్లవేళలా జాగ్రత్త కలిగియుండాలి (కొలస్స 2:8).

**వారు ఏ మాత్రము సిగ్గుపడలేదు** (యిర్మియా 6:15) : నీతిహీనులు సిగ్గు ఎరుగరు అని జెఫన్యా చెప్పాడు (జెఫన్యా 3:5). సిగ్గుపడే రోజులు గతించిపోయాయి. అసభ్యకర వస్త్ర ధారణ పరిపాటి అయిపోయింది. ప్రజలకు సిగ్గు యేమీ లేనే లేదు. దుర్మార్గపు పిల్లలు, రౌడీలుగా తిరిగే వారిని ఎదురించే వారు లేరు. మనం దేవుని యొక్క పవిత్రస్థాయికి తిరిగి చేరుకోవాలి.

**వారు పురాతన మార్గములలో నడుచుకొనుటకు నిరాకరించిరి** (యిర్మియా 6:16) : మార్పుకావాలని గగ్గోలు పెట్టేవారు చాలమంది యున్నారు. క్రొత్త సంగతులు కాంక్షించుదురు. అయితే ఆదిలో బైబిలు యేమి చెప్పెనో అదే యిప్పుడును చెప్పుచున్నది. క్రొత్త నిబంధన క్రైస్తవ్యము, క్రీస్తు సంఘము 2000 సంవత్సరముల కంటే పురాతనమైనదని మనము గ్రహించు కోవాలి. దేవుని వాక్యమైన "పురాతన మార్గములను" మనము అన్వేషించాలి.

పాత నిబంధన నుండి మనం గొప్ప పాఠములను నేర్చుకొనవచ్చును. బైబిలును చదువుచుండగా వీటిని మనస్కరించి చదువు కొందుము గాక!

– డాన్‌వాకర్

# ఇవి ఎవనికి లేకపోవునో

"ఇవి మీకు కలిగి విస్తరించిన యెడల అవి మన ప్రభువైన యేసు క్రీస్తును గూర్చిన అనుభవజ్ఞాన విషయములో మిమ్మును సోమరులైనను, నిష్ఫలులైనను కాకుండ చేయును. ఇవి ఎవనికి లేక పోవునో వాడు తన పూర్వపాపములకు శుద్ధికలిగిన సంగతి మరచిపోయి గ్రుడ్డివాడును, దూరదృష్టి లేనివాడు నగును" (2 పేతురు 1:8,9).

ఇక్కడ రెండు రకములైన క్రైస్తవులను మనము చూచుచున్నాము : క్రైస్తవ సద్గుణములను కలిగియున్న వాడు, వాటిలో అభివృద్ధి జెందుచున్న వాడు ఒకడైతే మరియొకడు ఈ క్రైస్తవ లక్షణములను లేనివాడు. ఈ సత్‌క్రైస్తవ లక్షణములలో కొందరు ఎందుకు పెరగరు?

వారు తమ గతపాపముల నుండి రక్షించబడిన వారమని మరచి పోయారు. కొందరు క్రైస్తవులు ఎందుకు పడిపోతారంటే వారు తమ గత పాపముల నుండి వేరు చేయబడిన వారమని మరచిపోయారు. దిగువ సంగతులను వారు మరచిపోయారు :

దేవుడు వారిని ఎంతో ప్రేమించారు (యోహాను 3:16).

రక్షించడానికి సువార్త దేవుని శక్తియైయున్నది (రోమా 1:16).

లేఖనముల ప్రకారము క్రీస్తు వారి పాపముల నిమిత్తము మృతి బొందెను (1కొరింథీ 15:3,4).

వారిని ప్రేమించి వారి కొరకు మరణించిన దేవుని కుమారుని మరిచారు (1యోహాను 1:7).

వారు విశ్వాసము ద్వారా కృప చేతనే రక్షింపబడ్డారు (ఎఫెసీ 2:8).

ఆయన తన కనికరము చొప్పున మనలను రక్షించారు (తీతు 1:5). మరచిపోవుట అంటే ఆత్మీయముగా మరణించుటే.

కొందరు క్రైస్తవులు గ్రుడ్డివారు, దూరదృష్టిలేనివారు, క్రైస్తవ సద్గుణములను మనం కలిగియుండకపోతే, మనం దూరదృష్టిలేనివారము, ఆత్మీయముగా గ్రుడ్డివారము. అవును

మనం గ్రుడ్డివారమే.

ఆత్మీయాశీర్వాదములన్నీ (ఎఫెసీ 1:3).

శోధనలు వచ్చినపుడు తప్పించు కొను మార్గమును ఆయన కలుగ జేయును (1 కొరింథీ 10:13).

దుష్టసాంగత్యము మంచి నడవడిని చెరుపును (1కొరింథీ 15:13).

పాపభోగము స్వల్పకాలమే (హెబ్రీ 11:25).

పరలోకంలో నిజంగా అనేక నివాసములు కలవు (యోహాను 13:1-3).

లవొదికయులో యున్న సంఘము ఆత్మీయ అంధత్వమునకు మాదిరియైయున్నది (ప్రకటన 3:14-17).

మనం గతపాపముల నుండి శుద్ధి నొందిన వారమని మరవకుండు నట్లు దేవుడు మనకు సహాయం చేయునుగాక. మనం ఈ జీవితానంతరం చూడగలిగితే, పరలోక నివాసములను చూడగలిగితే ఈ క్రైస్తవ సద్గుణములను కలిగియుండాలి : ఈ హేతువుచేతనే మీ మట్టుకు మీరు పూర్ణజాగ్రత్త గలవారై మీ విశ్వాసము నందు సద్గుణమును, సద్గుణమునందు జ్ఞానమును, జ్ఞానమునందు ఆశా నిగ్రహమును, ఆశా నిగ్రహము నందు సహనమును, సహనమునందు భక్తిని, భక్తియందు సహోదర ప్రేమను, సహోదర ప్రేమయందు దయను అమర్చుకొనుడి" (2 పేతురు 1:5-7).

– థెర్మన్ హోడ

## గొప్ప ఆజ్ఞ

క్రీస్తు యిచ్చిన గొప్ప ఆజ్ఞను ఎందుకు అట్లు పిలవడం జరిగింది? దిగువ అంశములను గమనించుము:

మొదటిగా, పరము నుండి దేవుని కుమారుడు యేమి తీసికొని వచ్చినా అది గొప్పదే. మానవుడు ఈ భూమిపై సమయానికీ స్థలానికీ పరిమితి చేయబడ్డాడు, గాని పరలోకమునందే ఈ గొప్ప ఆజ్ఞ వెలువడింది.

రెండవది. అది లోకమున కంతటికీ వర్తించును గనుక గొప్ప ఆజ్ఞ యనబడింది. అందరికీ వర్తించే సంగతులు చాలా తక్కువే. పురాతన గ్రీకు, రోమా ప్రజల దేవుళ్ళు ప్రాంతీయ దేవుళ్లే. భౌగోళికంగా సాంఘికంగా వాటి ప్రభావము సంకుచితమే. అయితే ఒక వర్తమానము సర్వజనాంగము లకు, సర్వ సృష్టికీ వర్తింప జేయబడుట గొప్పసంగతే!

మూడవదిగా, అది పాపక్షమాప ణను, అపరాధ పరిహారార్థమును, పరలోకనిరీక్షణను అనుగ్రహించు చున్నది. గనుక అది గొప్ప ఆజ్ఞ అనబడింది. ద్రవ్య లాభమును భౌతిక ఆరోగ్యమును అది వాగ్దానము చేయకపోయినను, అంతకంటే శ్రేష్ట మైనదానిని అది యిచ్చుచున్నది. మానవుని ఆత్మకు పాపము నుండి నిత్య రక్షణను వాగ్దానము చేయుచున్నది.

నాల్గవదిగా, దానిని ప్రకటించు టకు దానికి లోబడుటకు సామాన్య ప్రజలకే అప్పగించబడినది గనుక అది గొప్ప ఆజ్ఞయైనది. అది విద్యావంతులకే, లేక విద్యలేనివారికే పరిమితం చేయబడలేదు. జనాంగమును బట్టి గాని లింగభేదమును బట్టి గాని పరిమితం చేయబడలేదు. ప్రతి క్రైస్త వుడు యితరులకు సువార్త బోధించే అవకాశము కల్పించుచున్నది గనుక అది గొప్ప ఆజ్ఞయైయున్నది.

అది ఉన్న అధికారముల కంటే ఉత్కృష్టమైన అధికారము మీద ఆధార పడియున్నది గనుక గొప్ప ఆజ్ఞయైనది. మత్తయి 28:18లో యేసుక్రీస్తు ఆ యాజ్ఞను జారీచేయకముందు ఇహ మందును, పరమందును ఆయనకు సర్వాధికార మీయబడినదని చెప్పారు. ఆ మాటలు చెప్పి గొప్ప ఆజ్ఞను జారీ చేసారు.

ఈ రీతిగా మనం ఎన్నో సంగతులు చెప్పుకోవచ్చును. అయితే ఒక ప్రశ్న : గొప్ప ఆజ్ఞలో యున్న పాపక్షమాపణ తరుణాన్ని వినియోగించుకొన్న తరువాత, ఆ సువార్తను యితరులకు బోధించుటకు అది ప్రోత్సహించు చున్నది గనుక అది గొప్ప ఆజ్ఞయైనదా?

-బిల్ కీల్

# సంక్షిప్తవార్తలు

సత్యవాణి స్కూల్ ఆఫ్ ఎవాంజలిజమ్ (SSOE) ప్రారంభించబడి ఒక సంవత్సరము పైబడినను, అది ప్రభువు కొరకు సాధించుచున్న విజయములు అనేకములు. ఆన్‌లైన్‌లో జూమ్ ద్వారా బోధన చేయుచుండినందుకు స్థానికముగాను, వివిధ రాష్ట్రములలోను యున్న తెలుగు వారు ఈ పద్ధతి ద్వారా బైబిలును నేర్చుకొనుచున్నారు. గత సంవత్సర కాలములో అనేక మతశాఖల వారు సత్యమును గ్రహించి క్రీస్తుకు లోబడుచు ఆయన సంఘస్థులగుచున్నారు. గతంలో ఇద్దరు ముగ్గురు మతశాఖల బోధకులు (SSOE) ద్వారా సత్యమును గ్రహించి వారు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందుటయేగాక, వారి సంఘములను కూడ క్రీస్తులోనికి మార్చిరి.

2021 మే నెల మొదటివారంలో కేథలిక్ సంఘమునకు చెందిన విద్యార్థి కాకినాడకు ప్రయాణించి, బాప్తిస్మము పొంది సంతోషముతో తన గ్రామమునకు తిరిగి వెళ్లాడు. మే నెల 2వ వారంలో కాకినాడ సమీపములో వెంకటకృష్ణరాయ పురంలో యున్న ముగ్గురు సత్యవాణి కార్యాలయమునకు వచ్చి బాప్తిస్మము పొందిరి. మీరు సత్యమును గ్రహించెదరు, సత్యము మిమ్మును స్వతంత్రులనుగా చేయునని యేసు చెప్పిన మాటలో ఇప్పటికిని శక్తి యున్నది.

2021 మే నెల మొదటి వారములో అమెరికాలో ఓహాయో రాష్ట్రములో జరిగిన లేడ్స్ టు లీడర్స్ (L to L) కన్వెన్షన్‌లో రిక్కీ గూటం గారు, జస్టిన్ గూటం గారు పాల్గొనిరి. అనేకమంది యువతీయువకులు దానిలో పాల్గొనిరి. జస్టిన్ గూటం గారు యాకోబు పత్రిక అంతయు ఇంగ్లీషులో కంఠోపాయముగా వల్లించుట చూచి అందరు ఆశ్చర్యచకితులైరి. మరల మే నెల మూడవ వారంలో అలబామాలో జరిగిన లేడ్స్ టు లీడర్స్ కన్వెన్షన్‌లో కూడా రిక్కీ గారు, జస్టిన్ గారు పాల్గొనిరి. లేడ్స్ టు లీడర్స్ ఇండియా కన్వెన్షన్‌కు రిక్కీగారు కో ఆర్డినేటర్‌గా యున్నారనునది చదువరులకు విదితమే.

ఈ వేసవిలో కరోనా కోవిడ్ యొక్క తీవ్రత మన దేశంలో చాల తీవ్రముగా

యున్నందున లక్షలాది ప్రజలు దాని బారినపడి బాధపడుచున్నారు. అనేకులు యువకులు, వృద్ధులు కూడా దాని వలన మరణించి యున్నారు. సహో. జి. దేవదానం, సహో. జి. విజయకుమార్ (బెంగుళూరు) ప్రభువునందు నిద్రించిరి. శ్రీకాకుళం జిల్లాలో నాలుగు దశాబ్దాలకు పైగా పనిచేసిన సోదరులు థామస్ జాన్సన్ గారు కూడ కరోనావలన మృతిచెందిరి. కరోనా వలన ఆక్సిజన్ కొరత ఏర్పడుచున్న వారికి రిక్కీ గారు అమెరికాలో యున్నను ఇక్కడ ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్ సదుపాయము కల్పించుచున్నారు.

సత్యవాక్కు వలయువారు సంవత్సరమునకు రూ. 50/-లు సభ్యత్వముగా ఎమ్. ఒ. ద్వారాగాని, ఫోన్ పే ద్వారా గాని (నెం. 99122 86255) పంపించి ఈ పత్రికను పొందగలరు.

**RNI Regd. No. 69973/98**
**Postal Regd. No. AP/KD-02/2021-2023**

**సత్యవాక్కు**
పోస్టుబాక్సు - 80
కాకినాడ - 533001
ఆంధ్రప్రదేశ్

ప్రచురణ తేది : ప్రతి నెల 9వ తేదీ
పోస్టు చేయు తేదీ : ప్రతి నెల 15వ తేదీ

ఎడిటెడ్ & పబ్లిష్డ్ బై జాషువా గూటమ్. ప్రింటెడ్ బై హిమ్ ఎట్ సత్యవాణి పబ్లికేషన్స్, సాంబమూర్తి స్ట్రీట్, కాకినాడ - 533004